# కొత్తమ్మ

"చిన్నతల్లీ ఇట్రారా... నీకు కొత్తమ్మ కావాలా? పాతమ్మా?"

చిన్నతల్లి కళ్ళెత్తి ఇడ్లీలు పెడుతున్న తల్లివైపు చూసింది.

నీటిచెలమల్లాంటి విశాలమైన అమ్మ కళ్ళలో పాపాయి ఏం చూసిందో... కళ్ళు తిప్పుతూ.

"నాకు పాతమ్మే..." అన్నది.

రావు పెద్దగా నవ్వేడు.

"ఓ.కె. శాంక్షన్. నీ కూతురు నీకే ఓటేసిందోయ్. నీ ఉద్యోగం ఖాయం"

జానకి నవ్వింది. ఇల్లంతా నవ్వుల అలలు. చిన్నితల్లి బుట్టబొమ్మ వంటి గౌను ఆడిస్తూ డైనింగ్ టేబిల్ మీద వేస్తున్న అడుగులు... గిన్నెలు సర్దుతున్న అమృతం పెదవుల మీద సన్నని ఆనందరేఖ... ఎవరో కత్తిరించినట్లే జానకి నవ్వు ఆగిపోయింది.

"పాపాయికి పాలు తెస్తాను"

గొణుగుతున్నట్లు అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. లోపల జానకికి సొంతమైన నాలుగు

గోడలున్నాయి. ఎప్పుడూ రావు అక్కడికి వచ్చినట్లు లేదు. మహా అయితే గుమ్మంలో నిలబడి.

''జానీ కాఫీ ఇస్తావా...'' అంటాడు. లోపలికి వెళ్ళాక జానకికి ఊపిరి ఆడింది. గిన్నెలు, డబ్బాలు, పంచదార డబ్బా, స్పూన్లు, మరుగుతున్న నీళ్ళు... పాలు... ఇవన్నీ ఓసారి కళ్ళు తిప్పి చూశాక జానకి మళ్ళీ ఓపిక వచ్చినట్లు అన్నీ సర్దటం మొదలుపెట్టింది. చేతులు పనిచేస్తున్నా మెదడు ఆలోచిస్తూనే ఉంది.

ఎందుకు ఖండించలేకపోయింది. ఎక్కడుంది తన బలహీనత. అది సరదాకు నవ్వులాటకు జరిగే సంఘటనే అయినా ఎక్కడో సున్నితమైన బంధం ఏదో తెగిపోతున్న భావన. సహించే శక్తి తనలో ఏవైపు నుంచి వచ్చి చేరుతుందో జానక్కి అర్థం కాదు. అలవాటుగా పై రాక్ తీసింది. అక్కడ వుంచిన ఫైల్ కిందకి తీసింది. ఇంటికి సంబంధించిన బిల్లులు, కాయితాలు వుండే ఫైల్. పైన బంగారు రంగు అక్షరాలతో జానకి ఎం.ఏ. హోమ్‌సైన్స్ కేటరింగ్ టెక్నాలజీలో సర్టిఫికెట్. వరసాగ్గా తన డిగ్రీలు. ఓసారి చేత్తో దాన్ని వుమ్టుకుంది. జానకీ... డైనింగ్‌రూంలోంచి కేక.

''వస్తున్నా...''

ట్రేలో అన్నీ సర్దుకొని పాపాయికి పాలు తీసుకుని హాల్లోకి వెలుతుంటే తను మామూలు మొఖం ఎలా పెట్టగలిగిందో జానకికి ఆశ్చర్యం.

అరగంటలో ఇల్లంతా నిశ్శబ్దం. పాపాయి కోసం క్రష్ నుంచి రిక్షా వచ్చింది. రావు కోసం ఆఫీసు కారు వచ్చింది. వెలుతూ జానకికి చాలా బాధ్యతలు అప్పజెప్పాడు. గీతాముఖర్జీతో ఓ అరగంట కాలక్షేపం చేయాలి. ఆవిడను డిన్నర్‌కు పిలవాలి. తనతో చాలా పనులున్నాయి. ఆవిడ కంపెనీ డిపాజిట్లు రావుకి వచ్చేలా చేసుకొందుకు కాస్త మంచి చేసుకోవాలనే ఉద్దేశంట. రామన్ ఫోన్ చేస్తే సాధ్యమైనంత మర్యాదగా అతన్ని వదిలించుకోవాలి. వాడివల్ల పని దండగ. పూరికే బాతాఖానీగాడు. రావు కంపెనీ ఎం.డి. ఇంట్లో చిన్న ఫంక్షన్. జానకిది మంచి టేస్ట్ కనక కాస్త ఖర్చు తక్కువలో డాబుగా వుండే ప్రెజెంటేషన్ కొనాలి. ఇలాటి పనులు జానక్కి రోజూ ఉంటాయి సాధారణంగా.

అమృతం ఇల్లంతా పొందికగా సర్దేస్తోంది.

''నీకు కొత్తమ్మా... పాతమ్మా''

''నేనంటే మా టైపిస్టుకి గ్లామర్...''

''లాభం లేదోయ్ నువు ముసలిదానివి అయిపోతున్నావ్. కొత్త పిల్లను పట్టాల్సిందే...''

''జానీకి తోడు లేరండీ... క్యాంపుల కెళ్ళిపోతే ఒక్కతె ఉండలేకపోతుంది. వెంటనే ఓ అమ్మాయిని చూడాల్సిందే...''

ఇలాంటి జోకులన్నీ డ్రాయింగ్‌రూమ్‌లోనూ, బెడ్‌రూమ్‌లోనూ ఎక్కడోక్కడ, రావు ఫ్రెండ్స్ మధ్యనీ పేలుతూనే ఉంటాయి. అలా ఆడదాని స్థాయిని నిర్ణయించే జోకులు జానకి వింటూనే ఉంటుంది. లోలోపలే ఎక్కడో సున్నితమైన భాగంలో కాస్తకాస్తగా గాయం తగులుతుంది.

''నీ ఉద్యోగం గ్యారంటీనోయ్...''

అతను సరదాకూ, సీరియస్‌గానో చెప్పినట్లు తను తీసుకొంటోందా. ఇది ఉద్యోగం వంటిదే అయితే ఎంత బావుణ్ణు. కానీ ఉద్యోగం కాదే. ఎందుకు తను ఉద్యోగం వద్దనుకుందో తెలియదు. నాన్న తొందరపెట్టేశాడు. రావు తెలిశాక ఆయన చాలా ఆనందించాడు. అతను తెలివైనవాడు. మెట్లన్నీ చకచకా ఎక్కగలిగినవాడు. నాన్న ఆలోచన తప్పులేదు. అయితే అతని కోసం నోట్సులు రాసి, టీలు పెట్టీ, సేవ చేసి సేదతీర్చి ఇల్లంతా అతని సౌకర్యం కోసం తీర్చిదిద్దిపెడితే అతనికి ఆఫీసర్ పదవి. తనకు అతని దయతో, సౌకర్యవంతమైన ఇల్లాలి జీవితం. అతని కోసం కారొస్తోంది. ఎగ్జిక్యూటివ్స్ వస్తారు. పెద్ద ఆఫీస్ అతని కంట్రోల్‌లో ఉంటుంది. ఇదంతా చేసినందుకు అతనికి డబ్బొస్తోంది. రెండు చేతులా సంపాదిస్తాడంటే సబబు. తనకి? అతని డబ్బులో పర్సనల్ జీవితంలో ఎక్కడా ప్రవేశం లేదు. డబ్బు, ఇల్లు జీవితం అంతా అతని కంట్రోల్‌లో. షాపింగ్‌కు వెళ్ళాలంటే రావుని తను ఆ రాత్రి ప్రేమగా అడగాలి. రావు సంతృప్తి పడాలి. రేపు షాపింగ్‌కు వెళతావా జానీ... అతని తన ముంగురులు ప్రేమగా సవరిస్తూ రావు అడిగేవరకూ ఆ నాటకం కొనసాగాలి. తనకి ఇంకేదైనా అవసరం వస్తే ఆ విషయం అతని దృష్టికి తెస్తే అతనికి అది మంచిదనిపిస్తే తన చేతిలో డబ్బులు పడతాయి. 'ఎందుకు జానీ వేస్ట్' అన్న మాటతో తన రిహార్సల్స్ వేస్ట్. రావు ఆఫీసర్ డిగ్నిటీకి తగ్గట్లు తను తయారయ్యేంతవరకూ అతని పర్మిషన్ లభిస్తుంది.

తను ఈ ఇంట్లో ఉద్యోగి కాదా? ఈ చాకిరీకి తనకు వేతనం లభించదా? తనూ రావుతోపాటే ఆలోచించి, రావులాగే నిర్ణయం తీసుకునేందుకు కుదరదా?

తనకూ ఫ్రెండ్సున్నారు. వాళ్ళతో తనూ మాట్లాడుతుంది. అయితే అది రావు మాట్లాడినట్లుండదు.

రావు ధీమాగా చెబుతుంటాడు.

''ఓ.కే. రేపు ఫిక్స్ చేయండి. రాత్రంతా గానాబజానా... అదే రవికి కబురు పెట్టండి.

వాడి పాట వినకపోతే దిల్ హుషారవదు. అన్నట్లు శర్మగాడిని కొట్టుకురండి. ఆడు జోకులెయ్యకపోతే పార్టీ పార్టీ కాదు...''

తనూ చెపుతుంది.

రేపా... నేను సాయంత్రం చెపుతాను. రావు వస్తాడు కదా... నోనో రేపు కుదురుతుందేమో పనంటూ ఏం లేదు... రావుకి ఓసారి చెప్పి... ఫరవాలేదు... కేరియర్ అమృతం ఇచ్చేస్తుంది... రావుతో చెప్పి...

తనను ప్రత్యేకించి రావు కంట్రోల్ చేయనక్కరలేదు. రావు ఆలోచనలు తనను నిరంతరం కంట్రోల్ చేస్తూనే ఉంటాయి.

ఒక్కోసారి తనకూ అమృతానికి పెద్ద తేడా లేదు అనిపిస్తుంది. ఇంట్లో పని తనూ అమృతం కలిసి చేస్తారు. ఆ అమ్మాయికి గుప్పెడు అన్నం తినాలన్నా తను పర్మిషన్ ఇవ్వాల్సిందే. ఆమె మూడేళ్ళ బిడ్డకు ఓ పండు ఇవ్వాలంటే తనకు దయ కలుగవలసిందే. అచ్చం తను రావును మెప్పించి తన పనులు చేసుకున్నట్లే కాస్త సేవచేసి, చీరెలు బాగా ఇస్త్రీచేసి ఇల్లు ఇంకాస్త నీట్‌గా సర్ది తనను మెప్పిస్తుంది అమృతం.

జానకి అశాంతిగా అటూ ఇటూ తిరిగింది. ఒకరకంగా అమృతం తనకంటే మెరుగు. జీతం వచ్చాక అమృతానికి కాసిని సొంత పనులుంటాయి. తన గుడిసెకు సంబంధించి చిన్న ప్లానింగ్ ఉంది. తమకలాటి కెపాసిటీ... ఇలా అనచ్చా... పోనీ తన కలాటి అవకాశం రాదు. రావుకి తాన తందాన అనటమే.

ఫోను మోగుతోంది... అమృతం మాట్లాడుతోంది. ''అల్లాగేనండయ్యా గుడ్లు ఏయిస్తానయ్యా... అవునయ్యా... అబ్బే... గంటసేపు పనయ్యా... అయ్యా... ఫరవాలేదయ్యా... చేసేయగలను. అమ్మగారు వరండాలో ఉన్నారు. పిలమంటారాయ్యా... అయ్యా... అయ్యా...

జానకి సోఫాలో కూలబడింది. అమృతం అయ్యా అంటోంది. తనయితే ''అవును... సరే... ఎంతసేపూ అరగంటలో అయిపోదూ...అంటుంది.

గంటసేపు ఇద్దరు ఆడవాళ్ళు వంటింట్లో నరాలు తెగే పనిలో ఉండిపోయి ముగింపులో ఉండగా తను పరుగెత్తి స్నానం చేసి ఇస్త్రీ చీరె కట్టుకొని అలసట కనిపించకుండా చాలా నాజూకైన వేషం వేసుకొంటుంది. రావు అట్టహాసంగా స్నేహితులతో దిగుతాడు కార్లో... డ్రాయింగ్ రూమ్‌లో ఇక నవ్వుల జలపాతం దూకుతుంది. స్పూన్లు, ప్లేట్లు గలగలమని చప్పుళ్ళు చేస్తాయి. తను నాజూగ్గా నవ్వుతూ వడ్డిస్తుంది. తగు మోతాదులో శృంగారపరమైన జోకులు, కబుర్ల

వరకూ పార్టీ పరాకాష్టతో ఉంటుంది. తను గుర్తించనట్లు నవ్వేసి లేచి వచ్చేస్తుంది. 'ఎప్పుడూ సాటి ఆడదాన్ని గురించి అల్లా వెకిలిగా మాట్లాడకండి అన్నదా?... ఈలోగా ఇంకా ఇంకా ఐటమ్స్ అందిస్తూ, క్లీన్ చేస్తూ అమృతం హైరానపడి పోతుంది. ఎప్పటికో... ఆ సమావేశం ముగిస్తే రావు చేతులు పైకెత్తి అలసిపోయానోయ్... అంటూ బెడ్‌రూమ్‌లోకి భారంగా అడుగులు వేస్తూ వచ్చి అడ్డం పడతాడు. ఇంకా శృతి ముదిరితే ఆ కంపు వాళ్ళతోనే 'ఇల్లాగా రావోయ్' అంటూ శృంగారానికి సిద్ధం అవుతాడు. ఇదంతా తనకెప్పుడూ ఇబ్బంది కలిగించలేదు. లేదు... తను తననలా నమ్మించుకొంది. ఒక సౌకర్యం... సుఖం... మనిషిలో అలా ఆలోచనా శక్తిని చంపేస్తుందా?

'అమ్మా... టీ పొడి అయిపోయిందమ్మా, తెచ్చేదా?'' అడుగుతోంది అమృతం.

జానకి తల వూపింది నిర్లిప్తంగా. అమృతం గేటు దాటిపోయింది. అమృతం కొడుకు మూడేళ్ళవాడు తోటలో ఆడుకొంటుంటాడు. వాడొక్కడే... వాడిలో వాడే కబుర్లు చెప్పుకొంటుంటాడు. జానకి ముందున్న పిట్టగోడ ముందు నిలబడి వాడి గుప్పిట్లో దాచుకొన్న రంగురంగుల రాళ్ళు వరసగా పేరుస్తున్నాడు. తల్లి వెళ్ళిపోవటం గమనించి, చేయిజాపి ఏడవబోయి ఆవిడ వెళ్ళిపోవటం చూసి ఏడుపు ఆపేశాడు. జానకి తనవైపే చూస్తుండటం చూసి గుప్పిట్లో ఉన్న రాళ్ళు చూపించి ఇవ్వబోయాడు. ఏడుపు ఏడ్చి ఆపటంతో, చిన్న కన్నీటి ముత్యం వాడి బుగ్గ మీదకు జారింది. జానకి నవ్వింది. వద్దన్నట్లు తలవూపింది. వాడు పేరుస్తున్న రాళ్ళు నున్నగా ఉన్న గోడ మీద జారిపోతున్నాయి. వాడి మొహంలో అంతులేని ఓర్పు. మళ్ళీ వంగి తీస్తూ మళ్ళీ పేరుస్తూ–

''జానకిగారూ... అమృతం చచ్చిపోయిందండీ...'' గేటు అవతల నుంచి వీధి చివర షాపతను అరుస్తున్నాడు. జానకి ఒక్కసారిగా లేచి బయటకు పరుగుతీసింది. వీధి చివర జనం మూగి ఉన్నారు. అమృతం రోడ్డు దాటుతుంటే హారను మోగించకుండా వచ్చిన కారు కొట్టేసింది. నిమిషం క్రితం వంటిల్లంతా తిరుగుతూ పనిచేస్తున్న అమృతం రోడ్డుపైన వెల్లకిలా పడిపోయి ఉంది. చేతిలో భద్రంగా టీ పాకెట్. తలపగిలిపోయి, ఎర్రని రక్తం రోడ్డు మీద మడుగు కడుతోంది. జానకికి పెద్దపెట్టున దుఃఖం వచ్చింది.

''రావుగారి ఫోన్ నెంబర్ ఇవ్వండి'' అంటున్నాడు షాపతను. కళ్ళనీళ్ళతో మసకలు కమ్ముతున్న కళ్ళతో అమృతం వంకే చూస్తోంది జానకి. ఆరేళ్ళుగా ప్రతి నిమిషం తనతోపాటు ఆ ఇంట్లో వుంటున్న అమృతం. నాలుగేళ్ళ బిడ్డ చుట్టూ అమృతం అల్లుకొన్న కలలు, ఎప్పుడో ఓసారి ఇల్లంతా తిరిగి పాడు చేస్తున్నాడని, చిన్నపాప చేతిలో ఆట వస్తువులకు, బిస్కట్లకు ఎగబడుతున్నాడని రావు కోపగిస్తే, తల దించుకొని ఊరుకొంది అమృతం. అటు తరువాత

వాడిని వరండా దాటి లోపలికి తీసుకురానే లేదు. తోటలోనే ఆడుకొనేందుకు వదిలేసి, వాడిని కంటిరెప్పలా కాపాడేది. తన బిడ్డను ఎవరూ ఏమీ అనకూడదనే ఆత్మగౌరవం. తను సంపాదించే కాస్త డబ్బుని జాగ్రత్తగా సర్దుకొనే సమర్థత. తన పొట్ట నింపని భర్తపైన ఏనాడూ తిరస్కారం చూపించని మంచితనం. వాడు నెలకోసారి ఊరొదిలి వెళ్ళిపోతూ ఎప్పుడో సంవత్సరానికొకసారి కనిపిస్తున్నా వాడి కోసం అమృతం పడే బాధ ఇదంతా. ఇప్పుడు నిర్జీవమై... జానకి కాళ్ళకు రాళ్ళు కట్టేనట్లు భారంగా తిరిగి ఇంట్లోకి వచ్చింది. అమృతం కొడుకు ఇంకా రాళ్ళు పేరుస్తూనే ఉన్నాడు.

వీడి గతి ఏమిటి? అమృతం బతికి ఉండగానే వాళ్ళని పట్టించుకోని, సంపాదించి తిండి పెట్టే శక్తిలేని ఈ పిల్లవాడి తండ్రి వీడిని ఎలా చూస్తాడు? పది నిముషాల్లో రావు వచ్చేశాడు. ఫోన్ల మీద పన్లన్నీ అయిపోయాయి. రావు చాలా సమర్థుడు మరి. సాయంత్రం అవుతూనే అమృతం భర్త వచ్చాడు. వరండా దిగువన అతను నిలబడి సోఫాలో కూర్చున్న రావుతో చిన్నచిన్నగా అమృతం గురించి మాట్లాడేడు. రావు డబ్బు ఇచ్చాడు.

వాడలా వెళ్ళేక తలుపులు వేస్తూ గోడ పక్కన పడుకున్న అమృతం కొడుకుని చూసి ఆశ్చర్యపోయాడు రావు.

ఇదేమిటి వీడెందుకు ఇక్కడున్నాడూ?

వాళ్ళ నాన్నని వాడు గుర్తుపట్టలేదు. అతను పిలిస్తే వాడు హడలిపోయాడు అన్నది జానకి. నిజమే. వాడు రావుని, రావు వంటి అతని స్నేహితులనే కళ్ళతో చూశాడు. వాడి తండ్రి ఆకారం, అవతారం చూసి, వాడు నిజంగానే వెనక్కి తగ్గాడు. వాడు పుట్టే ముందు రోజూ వరకు అమృతం పనిచేస్తూనే ఉంది. నొప్పులు వస్తుంటే జానకి డబ్బు ఇస్తే రిక్షా ఎక్కి వొక్కతే గవర్నమెంటు ఆస్పత్రికి వెళ్ళింది. రాత్రంతా అరిచి, అరిచి, పక్కన ఓదార్చేవాళ్ళూ, సానుభూతితో దాని చేయి పట్టుకొనే వాళ్ళూ లేకుండానే బిడ్డని కన్నది. జానకి పురుటికి, జానకి తల్లి, అత్తగారు, వదినగారు యావన్మంది చుట్టాలు వచ్చారు. అమృతం జానకిని ఆదరపూర్వకంగా చుట్టుముట్టింది. జానకి మొహం చిట్లిస్తే తల్లడిల్లింది. చిన్నపాప పుట్టాక అలా అరచేతుల్లో ఉంచుకొని పెంచింది. చిన్నపాపకు చేసిన ముద్దులో నూరో వంతయినా పిల్లవాడి కోసం ఖర్చుచేసి ఉండదు. చిన్న పాపను ఓదార్చేఅమృతం వెనక పడుతూ లేస్తూ నడిచే ఆ పసివాడిని రావుతో సహా అందరూ చూచేరు. సంవత్సరానికోసారి అమృతం భర్త వస్తాడు. వాడు రాగానే గుడిసె బాగుచేసి వాడికి ఏదైనా తినేందుకు పెట్టేందుకు తాపత్రయపడేది అమృతం. అయినా, ఇంటి పని భారం తనపైన ఎప్పుడూ లేదు. అటు భర్త దగ్గరికి ఇటు జానకి వంటింటికి మధ్య అమృతం పరుగులు పెట్టేది. ఇదంతా రావుకి తెలియదు.

అయితే ఏమంటావు నువ్వు. సాకుతావా?

అన్ని మాటలెందుకు? అమృతం పోయి ఇంకా రెండు గంటలు కాలేదు. వాడి సంగతి మాట్లాడేందుకు ఇదా సమయం. రావు వాకచక్యంతో అరగంట క్రితమే వాళ్ళ ఆఫీస్ ప్యూన్‌ను తరిమి, ఇంకో కొత్త అమ్మాయిని పనికోసం తెచ్చేశాడు. ఆ అమ్మాయి ఇల్లు చక్కబెడుతోంది.

జానకి మాట్లాడేందుకు రావు అవకాశం ఇవ్వలేదు. జానకికి డిగ్నిఫైడ్‌గా ఉండాలని చెప్పాడు. పనిమనిషి కొడుక్కి స్నానం చేయించి, అన్నం తినిపించటం తను ఊహించలేనన్నాడు. వెనక్కి వెళ్ళి వరండాలో లైటు వేసి వీధి చివర షాపతని కోసం కబురు పెట్టాడు. అతనే అమృతాన్ని తీసుకువచ్చింది. అమృతం చాలా మంచి పిల్లని, భర్తకి పెద్దగా సంపాదించే ఓపిక లేదని, అతని సంపాదన అతనికే చాలదని చెప్పాడు. అవ్వాళ్ళ వచ్చిన అమృతం ఇలా వెళ్ళిపోయింది...

షాపతను కొట్టు మూసేసి వెళ్ళిపోయాడట. రావు లేచి లోపలికి వస్తూ జానక్కి స్ట్రిక్ట్ వార్నింగ్ ఇచ్చాడు.

రేపు ఉదయం ఈ తద్దినం ఇంట్లోంచి వెళ్ళిపోవాలని.

జానకి లైట్లు తీసేసి ఆ గదిలోనే కూర్చుంది గోడవారన. సొమ్మసిల్లి పోయినట్లు నిద్రపోతున్నాడు అమృతం కొడుకు బంగారు. అమృతం ఉంటే వాడికి సాయంత్రం ఆ తోటలో మూలన నిలబెట్టి స్నానం చేయించేది. ఉతికిన చొక్కా తొడిగేది. నిద్రపోయేదాకా తీరికుంటే వాడితో కబుర్లాడేది. ఇవ్వాళ అదంతా ఏవీ లేదు. వాడు ఓపికున్నంతవరకూ అలవాటుగా తోటలో ఆడాడు. చీకట్లు ముసురుకునే వేళకు వరండాలోకి వస్తే చిన్నతల్లి ఆడుతోంది. నోట్లో వేలేసుకుని అక్కడే కూర్చున్నాడు. జానకి వాడికి అన్నం కలిపిస్తే అమృతం కోసం దిక్కులు చూచేడు. తల్లి కనిపించకపోతే వాడే వళ్ళంతా పులుముకుంటూ ఏదో తిన్నాడు. అప్పుడయినా తను లేచి వచ్చి చిన్నతల్లికి అమృతం తినిపించినట్లు తినిపించిందా? ఏం లేదు. కడుపు నిండలేదనిపించి ఓ గ్లాసు పాలు తెచ్చిచ్చింది. వాడవి తాగేసి గోడ వారన పడుకొని, దొర్లిదొర్లి ఎప్పటికో నిద్రపోయాడు. ఎప్పుడూ పనిలో మునిగి, ఏ రాత్రికో పక్కలో చేరే తల్లి కనిపించకపోవటం వాడిని పెద్దగా బాధించలేదు.

రావు మంచినీళ్ళడిగాడు. తను లేచి తెచ్చుకోవచ్చు. ఎంత పనిలో ఉన్నా తను తెచ్చి ఇవ్వవలసిందే. తనకు పనిచేయటం జానకి హక్కులాగా తయారయింది. జానకి మేలుకొని ఆలోచిస్తోందని అతనికి అర్థం అయింది. 'ఎన్నని నేను చూసుకోను. గంటసేపటిలో శవాన్ని క్లియర్ చేయించా. ఈ తద్దినాన్ని నువు నెత్తిన పెట్టుకొన్నావు. నీకసలు పనిలేక మెదడు తుప్పు పడుతోంది...'

జానకి చేతిలో గ్లాసు వణికింది.

ఒక సేవకి, అభిమానానికి అతని గుర్తింపు అది.

అమృతం కొడుకు ఏదో పలవరిస్తూ ఇటు వత్తిగిల్లాడు. దుప్పటి జారిపోయింది. పక్కకి తిరిగితే వాడి జారిన బొజ్జ మెరుస్తూ కనిపించింది.

''చిన్నతల్లితో కలిసి ఆడుకొంటాడు. వాడికెంత కావాలని... పోనీ వాడిని ఇక్కడే ఉండిపోనివ్వండి...'' అన్నది జానకి.

రావు వెనక్కి తిరిగాడు.

''నీకేం పిచ్చెక్కిందా? అలాటి చెత్త ఆలోచన చేయొద్దు. నోరు మూసుకుని పడుకో...'' గట్టిగా చెప్పేడు.

కాదు... కూడదని చెప్పేందుకు తనకు అవకాశం లేదని జానక్కి తెల్సిపోయింది. ఈ ఇంట్లో తన పాత్ర ఏమిటి? తన చేతుల్లోంచి తన జీవితం ఎల్లా జారిపోయిందో ఇప్పుడు అర్థం అయింది జానకికి. చదువు విజ్ఞానం కోసం అని చెప్పుకొంటూ మనసుని జోకొట్టింది. తన కాళ్ళ మీద తాను నిలబడటం ఆర్థిక స్వాతంత్ర్యం లాటి విషయాలు తను ఆలోచించిందా? లోలోపల తనకే ఒక ఆధారపడే లక్షణం ఉంది. ఇలా సులభంగా బతికేద్దాం. కష్టపడే పని మనకి వద్దు... అని లోలోపల తనకి బద్ధకం ఉందేమో. చిన్న విషయంలో నిర్ణయం తీసుకోవాలంటే రావు తనూ కలిసి మాట్లాడుకోలేదు. పిల్లవాడిని ఏం చేద్దాం అనుకోలేదు. పోనీ ఎక్కడన్నా ఆర్ఫనేజ్‌లో చేరిస్తే ఎలా ఉంటుందీ అనీ పరస్పరం ఆలోచించుకునే అవకాశం తనకి దొరికిందా? అచ్చం అమృతమ్మల్లే చెపితే విన్నది అంతే. తన పాత్ర అంతవరకే... పదేళ్ళ నుంచి తను గడిపిన జీవితం ఒక్కోరోజు గుర్తు వస్తోంది జానకికి. రావు తన కెరీర్ కోసం పడిన తపన తను చూడలేదా? ఎప్పుడైనా తన గురించి తను ఆలోచించిందా? తన చదువు తనకి, తన చుట్టూ వుండేవాళ్ళకీ ఉపయోగపడాలని ఆలోచించిందా? భార్యగా ఈ ఇంట్లో అడుగుపెట్టి ఒక్కో అడుగు తనెలా దిగిందీ... రావుతోపాటు తనూ అన్నింటా సమానమేనని నిరూపించుకొందా? తనకు ప్రత్యేకమైన జీవితం కావాలనే తపన తనకే లేదు. తను పోగొట్టుకున్నదేమిటో జానక్కి స్పష్టంగా అర్థం అయింది. తను చేసిన కృషి ఏవీ లేదు. రావు ఇంకో అమ్మాయి పేరిట జోకులు వేసినా, తనేదో గొప్పగా, త్యాగం చేస్తున్నట్లుగా ఫీలయిపోయి ఓవర్‌యాక్షన్ చేసింది. అంతే, తనని చూస్తే తనకే నవ్వొచ్చింది. తన డిగ్రీ సర్టిఫికెట్ల ప్రయోజనం తను గుర్తించగలిగితే, ఈ ఇంట్లో రావుతోపాటు తనూ సమానంగా ఉండగలిగితే ఇవ్వాల్టి వేదన తనకు అనుభవంలోకి వచ్చేది కాదు. జానకి మళ్ళీ ఓసారి నిద్రలోఉన్న పిల్లవాడి వంక చూసింది. వాడు రెండుకాళ్ళు చాపి స్వేచ్ఛగా పడుకొన్నాడు. నిద్రపోతున్న ఈ పసివాడి కోసం

తనేం వేయలేదా? జానకి నవ్వుకొంది. ఇప్పుడు వాడి స్థితిలోనే తనూ ఉన్నది. ఇప్పుడు అప్పం వాడికి మల్లే నెమ్మదిగా పడిపోకుండా అడుగులు వేయటం నేర్చుకొంటే నెమ్మదిగా పరుగు అందుకొంటుంది. తను పడుతూ లేస్తూ వేసే అడుగుల్లోనే వాడి అడుగూ పడుతుంది. ఒకసారి ప్రారంభం అయ్యాక, దేన్నయినా ఎవరాపగలరు?

★

ఆదివారం ఆంధ్రభూమి

***2.2.1997***